

బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న కాచిగూడ సీఐ లక్ష్మీకాంతరెడ్డి

17 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి కాచిగూడ పోలీసులు 17 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు కాచిగూడ పీఎస్ సీఐ ఎల్. లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. గురువారం కాచిగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో కాచిగూడ పీఎస్ పరిధిలో 20 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 17 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నామన్నారు. రెండు నెలల్లో 17 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్ కేసులను ఛాలెంజ్‌గా తీసుకుని సిబ్బంది వెంటనే రికవరీ చేశారని తెలిపారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు దొంగలు తస్కరించిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ దొంగతనాలను నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్, ఎస్ఐ నరేష్‌కుమార్, సిబ్బంది శివ, అర్జున్, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో...



సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వివిధ సందర్భాల్లో విలువైన సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న దాదాపు వంద మంది సెల్‌ఫోన్‌లను కనిపెట్టి చిక్కడపల్లి పోలీసులు గురువారం అప్పగించారు. మరో ఇద్దరు బాధితులు శ్రీకాంత్, రమేష్‌రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఆ ఫోన్‌లు లభించడంతో వారి సెల్‌ఫోన్‌లు రెడ్‌మి, ఒప్పో ఫోన్‌లను ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య స్టేషన్‌లో అప్పగించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చిక్కడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బకాయి ఉన్న 20 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు విజ్ఞప్తి చేశారు. చిక్కడపల్లిలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. 6 వేల కోట్లకు పైగా అన్ని కాలేజీలకు విద్యార్థుల ఫీజులు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్, బీఫార్మసీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతూ కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లను కొన్ని కాలేజీ యాజమాన్యాలు ఇవ్వడంలేదన్నారు. మీ ఫీజులు బకాయి ఉన్నందున మీరు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొత్త అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాది అభిషేక్, నిఖిల్, అఖిల్ పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్‌గా భానుచందర్



భానుచందర్

చిక్కడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్‌గా భానుచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామకపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ ప్రజల్లో న్యాయవ్యవస్థపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి కృషి చేస్తానన్నారు.

రామకృష్ణమఠంలో యువతకు శౌర్య క్యాంపు

కవాడిగూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దోమలగూడలోని రామకృష్ణమఠంలో ఈ నెల 27 నుంచి యువతకు శౌర్య పేరిట క్యాంపు నిర్వహిస్తున్నామని హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. ఈ మూడు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గలవారు అర్హులని, యువకులకు రెసిడెన్షియల్ క్యాంపు ఉంటుందని ఆయన తెలిపారు. యువతకు స్వామి వివేకానంద సందేశంపై ప్రత్యేక తరగతులు ఉంటాయని తెలిపారు. ఆత్మవిశ్వాస్వాన్ని పెంపొందించడంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపునకు హాజరయ్యే యువత తెల్లటి దుస్తులు ధరించాలని తెలిపారు. వివరాలకు 9177232696 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



జలమండలి డీజీఎంను కలిసిన కార్పొరేటర్ రవిచారి

రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లో డ్రైనేజీ నూతన లైన్‌లను ఏర్పాటు చేయాలని చిలకలగూడ జలమండలి డీజీఎం మోహన్‌రావును గురువారం కార్పొరేటర్ కె. రవిచారి కలిసి వినతిపత్రం సమర్పించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలు కలగడం లేదని భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. సరూర్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాగరాజు(25) ఫిజియోథెరపిస్ట్‌గా చేస్తున్నాడు. యేడాదిన్నర క్రితం వివాహమైంది. పిల్లలు కలగడం లేదని భార్యతో గొడవపడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అత్తింటి వారు నాగరాజు వద్దకు వచ్చి భార్యను తీసుకుపోవాలని కోరారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాజు బుధవారం రాత్రి మలక్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో మూసీ రైల్వే బ్రిడ్జిపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

బర్కత్‌పర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బడుగుల కిష్టమ్మ(63) శివరాంపల్లిలో ఉంటూ కూలి పనిచేస్తూ జీవిస్తుంది. భర్త చంద్రయ్య కొంతకాలం క్రితం చనిపోయాడు. గురువారం సాయంత్రం కిష్టమ్మ వట్టిపల్లి వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

చెల్లిపై దాడి చేసిన సోదరులపై కేసు

కవాడిగూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి అద్దె డబ్బులు తల్లికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన చెల్లిపై ఇద్దరు సోదరులు దాడి చేసిన సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదయింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో హైమద్ బేగం అనే మహిళ నివాసం ఉంటుంది. ఆమె ఉంటున్న ఇంట్లో కొంత భాగాన్ని అద్దెకు ఇచ్చారు. నాలుగేళ్లుగా అహ్మద్ బేగం కుమారులు సయ్యద్ అజం అలీ, సయ్యద్ ముజఫర్ అలీ ఇంటి అద్దె తీసుకుంటున్నారు. అద్దె డబ్బులు తల్లికి ఇవ్వడం లేదన్న విషయం తెలుసుకున్న అహ్మద్ బేగం కూతురు సయ్యద్ పర్వీన్ ఇదే విషయంపై తన సోదరులను నిలదీసింది. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అజం అలీ, ముజఫర్ అలీ చెల్లి పర్వీన్‌పై దాడిచేశారు. తన ఇద్దరు సోదరులు కూరగాయలు కోసే కత్తితో తనపై దాడి చేశారని, దాంతో చేతికి తీవ్రగాయాలయ్యాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గాంధీనగర్ సీఐ రాజు తెలిపారు.

గురుకుల పాఠశాలలను మార్చొద్దు

- కొత్తగా 100 గురుకులాలు ప్రారంభించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపీ ఆర్. కృష్ణయ్య వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 100 గురుకులాలు ప్రారంభించాలని, రెసిడెన్షియల్ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చే ప్రతిపాదన వెంటనే ఉపసంహరించుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను ఎంపీ ఆర్. కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కలిసి ఈ అంశంపై చర్చించి మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్. కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మారుస్తామని ప్రకటించారని, దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల విధానం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కాదు ప్రైవేట్ రంగంలో కూడా ఉన్నాయని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో 55 శాతం విద్యార్థులు ఉన్నారని వారిని కూడా మారుస్తారా, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో మంచి విద్యా ప్రమాణాలు ఉన్నాయని, ఇందులో చదివిన వారు ఏఐఎస్, ఐపీఎస్ ఇతర ఉన్నత ఉద్యోగాల్లో వేలాదిమంది ఎంపికయ్యారని అన్నారు. మెడిసిన్, ఇంజనీరింగ్, ఐఐటీ తదితర ఉన్నత విద్యా వృత్తి విద్య కోర్సులలో వేల సంఖ్యలో ఎంపికై చదువుతున్నారని, వారి కుటుంబాలు బాగుపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఈ ఆలోచనను విరమించుకుని ఈ విధానంలో కొన్ని సంస్కరణలు తీసుకురావాలని ఆయన కోరారు. మంచి ఫలితాలు ఇస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను మార్చవద్దని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, నందగోపాల్, రఘుపతి, నిఖిల్, శ్రీనివాస్, పర్వతాలు పాల్గొన్నారు.



జీవీఎస్ రాజుతో చాంబర్ సభ్యులు

ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

చిక్కడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణులు, జూనియర్ చాంబర్ జోన్ చైర్మన్ జీవీఎస్ రాజు అన్నారు. కాంబోడియాలో జరిగినటువంటి దక్షిణ ఆసియా 20 దేశాల ఏఎస్‌సీఏసీ జూనియర్ చాంబర్ సదస్సులో పాల్గొన్న చాంబర్ జోన్ చైర్మన్ జీవీఎస్ రాజును గురువారం మధ్యాహ్నం చిక్కడపల్లిలోని జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా(జేసీఐ)నగర కార్యాలయంలో సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా జీవీఎస్ రాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో నాయకత్వ లక్షణాలు ఉండాల్సిన అవసరం ఉందని అప్పుడే ఈ పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్తూ ఏదైనా సాధించే అవకాశం ఉంటుందన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించే సదస్సు కాంబోడియాలో జరిగిందని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జేసీఐ జోన్ 12 అధ్యక్షుడు గోవింద్ కాకాని, జాతీయ ఉపాధ్యక్షుడు వినయ్ మెహతా, పాలిశెట్టి మధుబాబు, కేవీ రావు కూడా తనతో పాల్గొన్నారన్నారు.

ఆస్పత్రికి వచ్చిన యువకుడు అదృశ్యం

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బావను పరామర్శించడానికి వచ్చిన బావమరిది అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్‌హాట్‌కు చెందిన రాజు(22) కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బావను చూడటానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. రాజు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బంధువులు స్నేహితుల ఇళ్లలో వెతికినా రాజు ఆచూకీ లభించలేదు. దాంతో రాజు తల్లి అంజమ్మ గురువారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

2,800 బస్సులు గమ్యం యాప్‌తో అనుసంధానం

- 'గమ్యం యాప్ సేవలు అంతంతే'కు స్పందన

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు అంతంతే' అని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. గ్రేటర్ జోన్ పరిధిలో 2,800 బస్సులను గమ్యం యాప్‌నకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. యాప్‌లో బస్సుల వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ డిపోలో ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించామని తెలిపారు. డిపో పరిధిలో ఆయా బస్సుల ట్రాకింగ్‌ను ఆ ఉద్యోగి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు.



పేపర్ ప్లేట్ మిషిన్‌ను పరిశీలిస్తున్న గారేత్ వాన్ ఒవెన్

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్

అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పేపర్ ప్లేట్ మిషిన్ అందజేస్తున్నట్లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్ తెలిపారు. గురువారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రేమలీల ట్రాన్స్‌జెండర్ కార్యాలయంలో పేపర్ ప్లేట్ మిషిన్‌ను ఆయన అందజేశారు. ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి తోడ్పాటునందిస్తున్న హాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోనిని అభినందించారు. ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి మాట్లాడుతూ హాస్ సంస్థ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. ఆంథోని మాట్లాడుతూ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు ట్రాన్స్‌జెండర్లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 104 ఆవులు స్వాధీనం

కోదాడ రూరల్, జూన్ 13 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 104 ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీద్‌ఖాన్, యూసఫ్, సలీం ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 104 ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని సమాచారం అందింది. గురువారం కోదాడ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ ప్రారంభించారు. కంటైనర్‌ను గుర్తించి, ఆవులను, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆవులను ఏపీ రాష్ట్రంలోని వేద్రాద్రి దేవాలయ గోశాలకు తరలించి, సంబంధితులతో పాటు వాహన డ్రైవర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై కోదండరెడ్డి ఫిర్యాదు

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా తనపై లేనిపోని ఆరోపణలు చేసి సమాజంలో తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించిన కాంగ్రెస్ నాయకుడిపై ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అడ్మిన్‌గా ఉన్న ఓ వాట్సప్ గ్రూప్‌లో మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి గురించి ఆరోపణలు చేస్తూ ఒక వాయిస్ మెసేజ్‌ను డీకే శ్రీనివాస్ వాయిస్ మెసేజ్‌ను పోస్టు చేసినట్లు తెలిపారు. ఆ మెసేజ్‌లో తన పరువుకు భంగం కలిగించే విధంగా వాఖ్యలు ఉన్నాయని సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న నేతి రాజేశ్వర్

ఆర్ఎంపీ, పీఎంపీలకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు సర్టిఫికెట్ కోసం జీవో నంబర్ 429 అమలు చేయడంతో పాటు, ఆర్ఎంపీ, పీఎంపీలపై టీఎంసీ, ఐఎంఎ డ్రగ్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లు దాడులను నిలిపివేయాలని రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ విషయంపై ఫిర్యాదు చేయగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని కానీ నేటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు పారా మెడికల్ బోర్డు ద్వారా గుర్తింపు సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసనకు యత్నం

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాయదుర్గం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా నిఘా సంస్థలు డైరెక్టెడ్ వెపెన్స్‌తో తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడంపై టార్గెటెడ్ ఇండ్యూవిజువల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రావి తరుణ్ ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మరో నలుగురు సభ్యులతో కలిసి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందింది. వారు రావి తరుణ్‌తో సహా మరో ముగ్గురిని గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులు, భారతి సంతతికి చెందిన చాలామంది నిఘా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. న్యూరో వెపన్స్ ద్వారా అమెరికా నిఘా సంస్థలు అమెరికాలో ఉంటున్న వివిధ విదేశీ సమూహాలపైన నిఘా పెట్టి వేధిస్తున్నాయని ఆరోపించారు. ప్రారంభంలో అమెరికా పరిశోధన కేంద్రాల్లో నిమగ్నమై ఉన్న టెక్నాలజీ క్రమంగా అమెరికా ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేటర్ శక్తులకు అవసరంగా మారిందన్నారు. ఈ సమస్యపై అందరికి అవగాహన కల్పించి జాగృతం చేయడమే తమ లక్ష్యమని తరుణ్ పేర్కొన్నారు. న్యూరో వెపన్స్ గురించి హవాన సిండ్రోమ్, సింథటిక్ టెలిపతి గురించి ఎవరికి వారు పరిశోధన జరిపి నిగ్గుతేల్చుకుని వినాశనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పోలీస్ అరెస్టులు తమ కార్యక్రమాన్ని ఆపవని, భవిష్యత్‌లో పలు సెమినార్లు వర్క్‌షాపులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని అన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై వారిని వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

బీదర్, పద్మావతి రైలులో దొంగలు పడ్డారు

- ఎస్-4,9,10 బోగిలలో చోరీ
- పలువురి మెడల్లోని బంగారు గొలుసులు అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో దొంగలు పడ్డారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న పద్మావతి, బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్- 4,9,10 బోగిలోని ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఈ ఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సిగ్నల్ కట్ చేయడంతో రైలు ఆగిపోయింది. ఆ సమయంలో కింద రైలు పట్టాలపై ఉన్న నలుగురు దొంగలు ఎస్- 4,9,10 బోగిలలో కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణికులు మెడలలోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఎస్4 బోగిలో ప్రయాణం చేస్తున్న పద్మావతి అనే మహిళ మెడలో 4 గ్రాములు బంగారు గొలుసు, వర్ధనమ్మ మెడలో నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, వి.కుమార్ అనే ప్రయాణికుడి మెడలో 16 గ్రాములు బంగారు గొలుసు, జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్న కీర్తన బ్యాగులో ఉన్న రూ.13 వేల నగదు కిటికీల నుంచి ఎత్తుకెళ్లిపోయారు. బాధిత ప్రయాణికులందరూ గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదుల చేశారు. కేసు నమోదు చేసుకున్న జీఆర్‌పీ పోలీసులు ఖమ్మం జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేశారు. సిగ్నల్ కట్ చేసి రైళ్లలో దోపిడికి పాల్పడినట్లు విచారణలో తెలిసింది.

చేపల మార్కెట్‌లో మురుగు పరుగు



చేపల మార్కెట్‌లో పొంగుతున్న మురుగు నీరు

ముషీరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో 20 రోజులుగా డ్రైనేజీ పొంగి మురుగు నీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. చేపల మార్కెట్ సమీపంలో ఉన్న ఓ ఇంటి వద్ద డ్రైనేజీ నిండి మురుగు ప్రవహించడంతో తీవ్ర దుర్గంధం వస్తుందని, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటువైపు నుంచి నడవడానికి కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు పునరుద్ధరించాలి

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీలో గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పులను ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సరిదిద్దాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా కోరారు. గురువారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును గత ప్రభుత్వం మార్చేసి వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ అని పేరు మార్చడం జరిగిందని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమైన చర్య అని అన్నారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని అవమాన పరిచారని అన్నారు.

బీజేపీని ఆదరించిన తెలంగాణ ప్రజలు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



బండి సంజయ్‌ని అభినందిస్తున్న లాలా సందీప్‌కుమార్

నల్లకుంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుని ప్రజల్లో ఉన్న ఆదరణను చూపిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఢిల్లీలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నగరానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు లాలా సందీప్‌కుమార్ బండి సంజయ్‌కు పూల బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ మూడో సారి ప్రధాని కావడం దేశ ప్రజలు ఎంతో హర్షిస్తున్నారని అన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

- పట్టించుకోని అధికారులు



రిసాలగడ్డలో వంగిన విద్యుత్ స్తంభం

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని రిసాలగడ్డలో ఓ అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కిందపడి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, పాదచారులు భయపడుతున్నారు. విద్యుత్ స్తంభం కింది భాగంలో పూర్తిగా తుప్పుపట్టింది. దీంతో ఒకవైపు వంగిపోయింది. ఈ విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు, అపార్ట్‌మెంట్ నాయకుడు నగరం సురేష్ ఆజామాబాద్ ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కవులను సత్కరిస్తున్న ప్రముఖులు

పర్యావరణ పరిరక్షణకు కలమెత్తిన కవులు

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్య నివారణకు నాంది పలకాలని పలువురు వక్తలు సూచించారు. అంతర్జాతీయ పర్యావరణ వారోత్సవాల్లో నవ భారత నిర్మాణ సంఘం (ఎన్‌బీఎన్‌ఎస్), హెచ్‌డబ్ల్యూపీఎల్ కోరియ సంస్థల ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలో బహుభాష కవి సమ్మేళనంలో పర్యావరణంపై పౌరుల హక్కు అనే అంశంపై కవులు తమ కలమెత్తారు. ప్రస్తుత పరిస్థితులలో మంచి వాతావరణం కల్పించడం కోసం పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వంపై ఉందన్నారు. కాలుష్యాన్ని నివారించి ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి మంచి పర్యావరణాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కవి సమ్మేళనంలో హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్, కన్నడ బహు భాషలో 50 మందికి పైగా కవులు పాల్గొని కవితాపఠనం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి, దామోదర్, తదితరులు

రేరా ట్రిబ్యునల్ ఏర్పాటుతో వినియోగదారులకు భద్రత

చిక్కడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రేరా ట్రిబ్యునల్ ఏర్పాటు కావడంతో వినియోగదారులకు భద్రత లభించినట్లేనని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. గురువారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో వినియోగదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది సంవత్సరాలుగా రేరా ట్రిబ్యునల్ ఏర్పాటు కాలేదని ఈ క్రమంలో అనేక రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రీలాంచింగ్ ప్రకటనలతో వినియోగదారులు పెద్దఎత్తున మోసపోయారన్నారు. నాలుగు రోజుల క్రితమే రాష్ట్రంలో రేరా ట్రిబ్యునల్ ఏర్పాటు కావడం శుభపరిణామమని, దీనివల్ల వినియోగదారులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కాబట్టి వినియోగదారులు స్థిరాస్థి(నియంత్రణ, అభివృద్ధి) 2016 చట్టంపై అవగాహన పొంది ప్లాట్లను కొనుగోలు చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డా. పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ వివిధ చట్టాలలోని భవన నిర్మాణ నిబంధనలు, వినియోగదారుల రక్షణ చట్టం 2016 ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలని రేరా, హెచ్ఎండీఏ అధికారులను కోరారు.

రేషన్ బియ్యం విక్రయ ముఠా అరెస్ట్

- 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సివిల్ సప్లై అధికారులతో కలిసి హుమాయున్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట, యాకుత్‌పురా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు.

బియ్యం వ్యాపారులుగా చెలామణి అవుతున్న అత్తాపూర్‌కు చెందిన విశాల్‌యాదవ్ (22), ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నాసిర్ (28), వారాసిగూడకు చెందిన మహ్మద్ షోయబ్ (20), మహ్మద్ జహంగీర్, (28), ఎండీ షాబాజ్ (28)సరూర్‌నగర్‌కు చెందిన సంగంలోవ అలియాస్ రాజు(24), పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీం(25), అంబర్‌పేటకు చెందిన సయ్యద్ రహీం (25), సయ్యద్ నిజాం (24), మహ్మద్ మజార్ (28) రేషన్ బియ్యం దందా చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరించి, నిల్వ ఉంచుతున్నారు. వాటిని అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అరెస్ట్ చేశారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం